RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి - 13 సంచిక - 409 | 24 బుధవారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా..

# దాని వెనుక స్కాం ఉంటుంది

### : కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు.మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు.దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది.



ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు.ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు.

ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# పద్మశ్రీ పురస్కారాలు

## అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్





మన తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జాతీయ స్థాయిలో మరోసారి గర్వించదగ్గ గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు అత్యంత వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేశారు. ఈ విడతలో మొత్తం 47 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేయగా.. అందులో మన టాలీవుడ్ లెజెండ్స్ ఉండటం విశేషం.నాలుగు దశాబ్దాలుగా వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో, హాస్యంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్.. కళారంగానికి చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. నటుడిగా, నిర్మాతగా 'జయభేరి' బ్యానర్‌పై అద్భుతమైన చిత్రాలు నిర్మించడమే కాకుండా, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మురళీమోహన్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# హర్మ్యూజ్ జలసంధిలో రికార్డుస్థాయిలో ఆయిల్ రవాణా

### : ట్రంప్ ప్రకటన



ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హర్మ్యూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి.నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు.ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హర్మ్యూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.

# ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నా : విజయ్

తమిళనాడు అసెంబ్లీ సమావేశాల చివరి రోజున ముఖ్యమంత్రి విజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తాను షూటింగ్ నుంచి నేరుగా వచ్చి సీఎం అయినట్లుగా కొందరు ఇమేజ్ క్రియేట్ చేస్తున్నారన్నారు. కానీ, అందులో నిజం లేదని వ్యాఖ్యానించారు.అసెంబ్లీలో సభ్యుల చర్చలకు సమాధానం ఇస్తూ విజయ్ మాట్లాడారు. తమిళ వెట్రి కళగం (టీవీకే)కు మద్దతు ఇచ్చి అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవ కోసం అందరూ కలిసి పనిచేస్తే తమిళనాడు దేశంలో అగ్రస్థానంలో నిలుస్తుందని వ్యాఖ్యానించారు."షూటింగ్ నుంచి నేరుగా అసెంబ్లీకి వచ్చి సీఎం అయినట్లుగా కొందరు ప్రచారం చేస్తున్నారు. అది నిజం కాదు. ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో చోటు సంపాదించుకున్నందుకే నేను సీఎం అయ్యాను" అని విజయ్ వ్యాఖ్యానించారు. 1990ల నుంచే అభిమాన సంఘాల ద్వారా ప్రజలకు అండగా నిలిచామని విజయ్ తెలిపారు. రాజకీయాలపై మాట్లాడినందుకే తన సినిమాలు అనేక సమస్యలను ఎదుర్కొన్నాయని, ఆ విషయాలు అందరికీ తెలుసని అన్నారు. అలాగే ప్రభుత్వంపై విమర్శలు చేసిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌తో పాటు ఇతర సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిపక్షం తన బాధ్యతలో భాగంగా ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యానికి అవసరమని పేర్కొన్నారు. కరూర్ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర వేదన కలిగించిందని అన్నారు. ఆ బాధను మాటల్లో చెప్పలేనని, ఆ విషాదాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని చెప్పారు.తమిళ వెట్రి కళగం ఆవిర్భవించిన వెంటనే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను వ్యతిరేకిస్తూ ప్రకటన విడుదల చేశామని గుర్తుచేశారు. తన సినిమాల్లో కూడా అవినీతి వ్యతిరేకత, సామాజిక న్యాయం, విద్య వంటి అంశాలనే ప్రస్తావించానని చెప్పారు.



## సీఎం రేవంత్ కోసంకేంద్రమంత్రులతో

# సమావేశాలు ఏర్పాటు చేశా

### : కిషన్‌రెడ్డి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు.

జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు.కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

# కేంద్ర మంత్రి పదవికి జార్జి కురియన్ రాజీనామా



కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ సభ్యత్వ పదవీ కాలం ముగియడం, ఈసారి బీజేపీ అధిష్ఠానం ఆయనను తిరిగి నామినేట్ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.జార్జి కురియన్ సమర్పించిన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఇప్పటివరకు మోదీ క్యాబినెట్‌లో ఆయన మైనార్టీ వ్యవహారాల శాఖతో పాటు.. మత్స్య, పాడి, పశుపోషణ శాఖలకు కూడా సహాయ మంత్రి హోదాలో బాధ్యతలు నిర్వహించారు.జార్జి కురియన్ రాజ్యసభ ఎంపీ పదవీ కాలం గత ఆదివారం అంటే జూన్ 21న ముగిసింది. భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. పార్లమెంట్‌లో (లోక్‌సభ లేదా రాజ్యసభ) సభ్యుడిగా లేని వ్యక్తి గరిష్ఠంగా 6 నెలలు మాత్రమే మంత్రిగా కొనసాగే ఛాన్స్ ఉంటుంది. అయితే ఈసారి బీజేపీ ఆయనను తిరిగి రాజ్యసభకు పంపేందుకు మొగ్గు చూపకపోవడంతో, ఆయన తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది.ప్రస్తుతం ఉన్న కేంద్ర మంత్రివర్గంలో ఏకైక క్రిస్టియన్ మంత్రి జార్జి కురియన్ మాత్రమే కావడం గమనార్హం. కేరళలో క్రైస్తవ ఓటు బ్యాంక్‌ను ఆకట్టుకునే క్రమంలో బీజేపీ ఆయనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించింది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
24 బుధవారం జూన్ 2026

## సర్దార్ నగర్ గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ సమత ప్రకాష్



( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 23:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి పరిధిలోని సర్దార్ నగర్ లో మహేశ్వరం నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు సమత ప్రకాష్ మాట్లాడుతూ.. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు జిహెచ్ఎంసి పరిధిలోని చీరల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా.. మంగళవారం ఉదయం సర్దార్ నగర్ గ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ప్రతి ఆడబిడ్డకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలియజేశారు అర్హులైన ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు సమతా ప్రకాష్ తెలియజేశారు

## మహేశ్వరం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 23:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో మహేశ్వరం మండల కేంద్రంలో పలు గ్రామాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలో ఫీజులు నియంత్రించాలని ఈరోజు ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పాఠశాల బంద్ పిలుపును ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగా ఏబీవీపీ మహేశ్వరం మండలం కేంద్రంలోని ప్రైవేట్ కార్పొరేట్ ప్రభుత్వ పాఠశాలలో బంద్ విజయవంతం జరిగింది. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చవితి తల్లి ప్రేమ చూపెడుతుంది విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఎంఈఓ డీఈవో పోస్టులతో పాటు టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో విచ్చలవిడి దోపిడిని అరికట్టే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎన్ఈపి 2020 అమలు చేయాలని, గురుకుల పాఠశాలకు పక్క భవనాలు నిర్మించాలని అని ఏబీవీపీ డిమాండ్ చేస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా బందుకు పిలుపును ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏబీవీపీ ఆల్ ఇండియా కలామచ్ కో కన్వీనర్ మణికంఠ,ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్,ఎబివిపి గ్రేటర్ హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీ రాఘవేంద్రం,ఎబివిపి మహేశ్వరం నాయకులు వంశీ,సయ్యద్ ,అభిలాష్ , ప్రణీత్, రోహిత్, సిద్దు,చరణ్,సాయి కార్తీక్,ఉదయ్, హర్షతదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో బ్యాంకులు కీలక భాగస్వాములు కావాలి

### : కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

### రూ.88 వేల కోట్లకు పైగా రుణ లక్ష్యాలతో వార్షిక క్రెడిట్ ప్రణాళిక ఆవిష్కరణ




రంగారెడ్డి జిల్లా అభివృద్ధి, ఉపాధి కల్పన మరియు ఆర్థిక పురోగతిలో బ్యాంకులు మరింత చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. జిల్లాలో బ్యాంకింగ్ కార్యకలాపాలు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు పురోగతిపై సమీక్షించేందుకు మంగళవారం నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. నిర్వహించారు. జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వివిధ వాణిజ్య బ్యాంకుల ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ), నాబార్డ్ (నాబార్డ్) అధికారులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో వ్యవసాయ రుణాలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రుణాలు, విద్యా రుణాల పంపిణీ, స్వయం ఉపాధి పథకాల అమలు వంటి అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. రైతులు, స్వయం ఉపాధి యూనిట్లు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడంలో బ్యాంకులు మరింత ముందుండాలని కలెక్టర్ సూచించారు. చిన్న వ్యాపార యూనిట్ల అభివృద్ధికి అవసరమైన రుణాలను అందించడం, ఎంఎస్ఎంఈ రంగానికి క్రెడిట్ వృద్ధిని వేగవంతం చేయడం, అందుబాటు గృహ రుణాలను ప్రోత్సహించడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంకు అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద రుణ ప్రవాహాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని బ్యాంకులను కోరారు. జిల్లాలో సమగ్ర ఆర్థికాభివృద్ధి, ఆర్థిక చేర్పు లక్ష్యాల సాధనకు బ్యాంకులు మరియు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. రుణాల మంజూరు ప్రక్రియను సరళీకృతం చేయడం, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న అవరోధాలను తొలగించడం, అర్హులైన వారికి వేగంగా ఆర్థిక సహాయం అందించే చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అనంతరం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ)ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ ప్రణాళికలో ప్రాధాన్య రంగాలకు రూ.32,175 కోట్ల రుణ లక్ష్యాన్ని, ప్రాధాన్యేతర రంగాలకు రూ.56,144 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. మొత్తంగా రూ.88,319 కోట్లకు పైగా రుణాల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లా అభివృద్ధి, వ్యవసాయ ప్రగతి, పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన మరియు సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధనలో బ్యాంకులు ప్రభుత్వ భాగస్వాములుగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

## మహేశ్వరం మండలంలో రోడ్ల దుస్థితిపై మండిపడ్డ బిజెపి..

### ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట రెండో రోజుకు చేరిన నిరసన దీక్ష!


### ముఖ్యఅతిథిగా హాజరైన చేవెళ్ల పార్లమెంట్ కో-కన్వీనర్ అనంతయ్య గౌడ్..

### స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్!

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 23:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో మంజూరైన రోడ్ల పనులు గత నాలుగు సంవత్సరాలుగా ప్రారంభం కాకపోవడం, రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారడంపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) మండల శాఖ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతమయ్యాయి. అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి నిరసనగా గత రెండు రోజులుగా మహేశ్వరం ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట బిజెపి శ్రేణులు శాంతియుతంగా నిరసన దీక్ష చేపట్టారు.

గ్రామగ్రామాన పోరు దీక్షలు:
రోడ్ల దుస్థితిపై ప్రజలు ఎదుర్కొంటున్న నరకయాతనను ప్రభుత్వానికి, అధికారులకు కళ్ళు తెరిపించేందుకు గత 15 రోజుల క్రితమే బిజెపి ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో, ఆయా పాడైపోయిన రోడ్ల వద్దనే "పోరు దీక్ష" కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. గ్రామాల రోడ్లపైనే దీక్షలు చేసినప్పటికీ సంబంధిత అధికారులు కనీసం స్పందించకపోవడం, పనులు ప్రారంభించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరం.

రెండో రోజుకు చేరిన నిరసన దీక్ష - ముఖ్యఅతిథిగా అనంతయ్య గౌడ్:
అధికారుల మొండి వైఖరిని నిరసిస్తూ, తక్షణమే రోడ్ల పనులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ మండల శాఖ పిలుపు మేరకు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్ష నేటికి విజయవంతంగా రెండో రోజుకు చేరుకుంది. ఈ రెండవ రోజు దీక్షా కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ కో-కన్వీనర్ అనంతయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాలలో ఒక వార్డు సభ్యుడు తన బాధ్యతను తాను నిర్వర్తిస్తున్నాడని, సర్పంచ్ తన పని తాను చేస్తున్నాడని పేర్కొన్నారు. ప్రతి నెల గ్రామపంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసుకుంటూ, ప్రజల సమస్యలను వింటూ స్థానిక సర్పంచులు వాటిని పరిష్కరిస్తున్నారని కొనియాడారు. కానీ, మన స్థానిక ఎమ్మెల్యే కేవలం డైలీ ప్రోగ్రాములతో కాలక్షేపం చేస్తూ, ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రజల సమస్యల కోసం కేవలం ఒకే ఒక్క గంట కేటాయించడం అత్యంత హాస్యాస్పదమని మండిపడ్డారు.

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తక్షణమే రాజీనామా చేయాలి:
స్థానిక శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఇంతవరకు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండకుండా, కేవలం దావత్‌లు, ప్రైవేట్ కార్యక్రమాలకు తిరుగుతున్నారని బిజెపి నాయకులు తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి, కేవలం తమ పార్టీ (బిఆర్ఎస్) కార్యకర్తల ఎదుగుదల కోసమే వారు పని చేస్తున్నారని ఆరోపించారు.
మహేశ్వరం మండలంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే పట్టించుకోనటువంటి ఇలాంటి ఎమ్మెల్యే పదవిలో ఉంటే ఎంత, ఊడిపోతే ఎంత అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పరిష్కరించలేని సబితా ఇంద్రారెడ్డి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోంది. హుజూరాబాద్, మునుగోడుల వలె సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేస్తేనే మహేశ్వరం మండలానికి ప్రత్యేక నిధులు వస్తాయని, అప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు.

హెచ్చరిక:
ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాల్లో నిలిచిపోయిన రోడ్ల పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. లేనిపక్షంలో ఈ ఆందోళనలను మరియు నిరసన దీక్షలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కోకన్వీనర్ కాసుల అనంతయ్య గౌడ్ గారు, రాష్ట్ర నాయకులు దేశ్య నాయక్, రాష్ట్ర గిరిజ మోర్చా కార్యవర్గ సభ్యులు పంతు నాయక్, జిల్లా కార్యదర్శి ఆఇళ్ల యాదయ్య గౌడ్, జిల్లా గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్, గౌరవ సర్పంచ్ యాదయ్య, మాజీ సర్పంచ్ రఘుపతి గౌడ్ , బుగ్గని శంకర్, ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, మండల మీడియా సీన్వీనర్ మోతే యాదయ్య, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్ర పాండు, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు గోల్లూరు మాధవ్, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షులు కృష్ణ నాయక్, బిజెపి సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మంత్రి ముత్యం, బస్వా రఘు గౌడ్, సురేష్, ప్రకాష్, శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇన్చార్జిలు, మరియు బూత్ అధ్యక్షులు సహా పలువురు ప్రముఖులు, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.
మోతే యాదయ్య
మహేశ్వరం మండల మీడియా కన్వీనర్.

## తమపై దాడి చేసిన ప్రశాంత్ దాసును అరెస్టు చేయాలి

### బాధితులు అజయ్ సింగ్, మోహిత్ సింగ్



హైదరాబాద్, జూన్ 23: సాధువుల ముసుగులో దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారి నుంచి రక్షణ కల్పించాలంటూ పురాణా పూల్ ప్రాంతానికి చెందిన అజయ్ సింగ్, మోహిత్ సింగ్ లు పోలీసు ఉన్నత అధికారులను కోరారు, ఈ మేరకు మంగళవారం అఫ్జల్ గంజ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు అజయ్ సింగ్, మోహిత్ సింగ్ లు మాట్లాడుతూ.. పురానాపూల్ మూసినది పరివాహ ప్రాంతానికి, నిర్వాన్ అకాడ మట్ కి వెనకాల, ఆనుకొని ఉన్న 600 గజాల స్థలం, తమ పూర్వీకుల నుంచి గత 70 సంవత్సరాలుగా తమ కుటుంబం జీవనోపాధి పొందుతుందని, తాను కూడా ఇదే స్థలంలో నివాసం ఉంటూ గణేష్ విగ్రహాలను తయారు చేస్తూ వాటిని విక్రయించి వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నానని తెలిపారు, అయితే గత శనివారం నిర్వాహ అకాడ మట్ కు చెందిన ప్రశాంత్ దాస్ ఇతర రాష్ట్రాలకు చెందిన 15 మంది నాగసాధులతో తాను ఉంటున్న స్థలానికి మారనాయుధాలతో వచ్చి తనపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టి, తనని బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకుంటూ లాక్కొని వెళ్లి మఠంలో నిర్బంధించి తన ఒంటిపై ఉన్న గుడ్డలను కూడా తీసి తనపై పిడుగులతో లాఠీలతో విచక్షరహితంగా కొట్టారని అజయ్ సింగ్ తెలిపారు. కులుసుంపుర ఇన్స్పెక్టర్ రాములు, ఏసిపి తిరుపతయ్యలు పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి నిర్వాన్ అకాడ మట్ లో నిర్బంధించిన, తనను విడిపించారని తెలిపారు. వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారని ఆయన తెలిపారు. అజయ్ సింగ్ పై ఎందుకు దాడి చేస్తున్నారని, ఆయనను ఎందుకు నిర్బంధించారని అడిగిన తన అన్నకుమారుడు మోహిత్ సింగ్ తల పైన తల్వార్ తో సాధువులు దాడి చేయడంతో తీవ్ర గాయాలు పాలవడంతో అతని కేర్ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు.
సాధు ముసుగులో రౌడీలా తన ప్రాణాలు తీస్తే స్థలం తన వశం అవుతుందని ప్రశాంత్ దాస్ భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## క్లిష్టమైన వెన్నెముక సమస్యకు విజయవంతమైన శస్త్రచికిత్స

### 53 ఏళ్ల మహిళకు కొత్త జీవితం. యశోద ఆస్పత్రి వైద్యుల ప్రతిభకు మరో నిదర్శనం

### తీవ్రమైన స్పైనల్ కెనాల్ స్టెనోసిస్‌కు యశోదలో విజయవంతమైన చికిత్స




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 23:-
హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో తీవ్రమైన వెన్నెముక సమస్యతో బాధపడుతున్న 53 ఏళ్ల మహిళ విమలకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి వైద్యులు కొత్త జీవితం ప్రసాదించారు. చాలా కాలంగా నడుము నొప్పి, కాళ్లలో నొప్పి, నడవడంలో ఇబ్బందులు, కాళ్లలో బలహీనత వంటి సమస్యలతో బాధపడుతున్న మహిళ ఆస్పత్రిని ఆశ్రయించారు. వైద్య పరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్ అనంతరం ఆమెకు డీజెనరేటివ్ లంబార్ కెనాల్ స్టెనోసిస్, ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.
వెన్నెముకలోని పలు నరాలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారినట్లు నిర్ధారించారు.
ఈ నేపథ్యంలో యశోద ఆస్పత్రి స్పైన్ సర్జరీ విభాగానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ బుట్ల, నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృందం శస్త్రచికిత్స చేపట్టింది. మల్టీ లెవల్ స్పైనల్ ఫిక్సేషన్, డీకంప్రెషన్ ప్రక్రియలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించి నరాలపై ఉన్న ఒత్తిడిని తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం స్థిరంగా ఉండటంతో పాటు నొప్పులు గణనీయంగా తగ్గినట్లు వైద్యులు తెలిపారు. రోగికి ఉన్న ప్రధాన సమస్యల్లో నడుము నొప్పి, కాళ్లకు వ్యాపించే నొప్పి, నడవడంలో ఇబ్బంది, కాళ్లలో తిమ్మిర్లు, బలహీనత వంటి లక్షణాలు ఉన్నాయి. సమయానికి వైద్యులను సంప్రదించడం వల్ల సమస్యను విజయవంతంగా అధిగమించగలిగినట్లు వైద్య బృందం పేర్కొంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ బుట్ల మాట్లాడుతూ, వెన్నెముక సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే పెద్ద శస్త్రచికిత్సలు, దీర్ఘకాలిక ఇబ్బందులను నివారించవచ్చన్నారు. కాళ్లలో నొప్పి, తిమ్మిర్లు, నడవడంలో ఇబ్బందులు, నడుము నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
యశోద ఆస్పత్రి వైద్యుల నైపుణ్యం, ఆధునిక వైద్య సదుపాయాల సహకారంతో మరో క్లిష్టమైన వెన్నెముక శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తికావడం విశేషం. ఈ చికిత్సతో రోగి సాధారణ జీవన విధానానికి తిరిగి చేరుకునే అవకాశం లభించిందని వైద్యులు వెల్లడించారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
24 బుధవారం జూన్ 2026

# ఎస్ ఐ ఆర్ విజయానికి 2K రన్.. ఇబ్రహీంపట్నంలో ఓటరు అవగాహన ర్యాలీ

## ప్రతి ఓటరు బాధ్యతగా ముందుకు రావాలి.. ఎస్ ఐ ఆర్ పై ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 23:- ఇబ్రహీంపట్నంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ాౕ×=) కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 2ఖ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఇబ్రహీంపట్నం మరియు మంచాల తహసీల్దార్లు, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా అధికారులు ప్రజలకు ాౕ×= ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా వెన్నెముక వంటిదని పేర్కొన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు నిర్వహిస్తున్న ాౕ×= కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.




ప్రజల్లో ఓటరు జాబితాపై అవగాహన పెంచడం, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే ఈ 2ఖ రన్ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరి పాత్ర కీలకమని పేర్కొంటూ, రానున్న SIR కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# తుర్కయంజల్మన్నెగూడలో భూగర్భ తవ్వకాల కలకలం

## అనుమతులకంటే అధికంగా మట్టి తరలింపా..?
## సర్వే నంబర్ల వారీగా తవ్వకాలపై అనుమానాలు..
## వాస్తవాలను వెలుగులోకి తేవాలని గ్రామస్థుల డిమాండ్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 23:- రంగారెడ్డి జిల్లా: తుర్కయంజల్మన్నెగూడ: పరిసర ప్రాంతాల్లో నిర్మాణాల కోసం చేపడుతున్న సెల్లార్ తవ్వకాల వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. అనుమతులు పొందిన పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తుండటంతో సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. స్థానికుల వాదన ప్రకారం, మన్నెగూడ పరిధిలోని సర్వే నంబర్లు 410, 411/1, 411/2, 412, 412/ఆూ, 416/ఆ మరియు 4 ప్రాంతాల్లో ఒక ప్రైవేట్ సంస్థ నిర్మాణ పనుల కోసం అనుమతి పొందిన దానికంటే ఎక్కువ స్థాయిలో తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా తుర్కయంజల్ కమాన్ సమీపంలోని సర్వే నంబర్ 339లోని ప్లాట్ నంబర్లు 77, 78, 79, 80 పరిధిలో కూడా అనుమతుల కంటే అధికంగా భూగర్భ తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు సర్వే నంబర్ల వారీగా పరిశీలన నిర్వహించి, అనుమతుల ప్రకారం ఎంత మేర తవ్వకాలకు అనుమతి ఇచ్చారు, ప్రస్తుతం ఎంత మేర పనులు జరిగాయి అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. డ్రోన్ సర్వేలు, సాంకేతిక కొలతలు లేదా ఇతర ఆధారాలతో వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని వారు కోరుతున్నారు.

ఇప్పటివరకు ఈ అంశంపై మైనింగ్ శాఖ లేదా సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడం ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. చిన్న స్థాయి నిబంధనల ఉల్లంఘనల విషయంలో వెంటనే చర్యలు తీసుకునే అధికారులు, పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ తవ్వకాలపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భూగర్భ తవ్వకాల విషయంలో అదనపు జాగ్రత్తలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల సమయంలో తవ్వకాల కారణంగా ప్రమాదాలు



సంభవించే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. తుర్క యంజాల్ పరిధిలో జరుగుతున్న తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, అనుమతులువాస్తవ పనుల మధ్య వ్యత్యాసం ఉందా లేదా అన్న విషయాన్ని ప్రభుత్వం స్పష్టంచేయాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించి ప్రజల సందేహాలకు తెరదించాలని డిమాండ్ చేస్తున్నారు.

# లష్కర్గూడా వంతెనపై రాజకీయ రగడ.. మాజీ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నేతల ఘాటు విమర్శలు

## నియోజకవర్గ అభివృద్ధిపై మాటల యుద్ధం.. కాంగ్రెస్బీఆర్ఎస్ మధ్య ఆరోపణల పరంపర

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 23:- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో వాటిని జీర్ణించుకోలేక కొందరు ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు సిహెచ్ భాస్కర్ చారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో దీర్ఘకాలం ప్రజాప్రతినిధిగా పనిచేసిన నాయకులు తమ పదవీకాలంలో పట్టించుకోని సమస్యలను ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రస్తావించడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. ప్రత్యేకంగా లష్కర్గూడా ప్రాంతంలో వంతెన సమస్యను కేంద్రబిందువుగా చేసుకుని జరుగుతున్న ప్రచారం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో వరదల కారణంగా పలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నప్పటికీ వాటి పరిష్కారంపై స్పందించని నాయకులు ఇప్పుడు ఒక్క అంశాన్ని మాత్రమే ఎత్తిచూపడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, భూగర్భ



మురుగునీటి కాలువలు, ఇతర ప్రజా అవసరాలకు సంబంధించిన పనులు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే కోహెడ ప్రాంతంలో ప్రతిపాదించిన సమీకృత మార్కెట్ యార్డు ప్రాజెక్టు భవిష్యత్తులో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించబోతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని చెప్పారు. పాత మార్కెట్ స్థల వినియోగంపై వస్తున్న ఆరోపణలకు వాస్తవాధారాలు లేవని స్పష్టం చేశారు. సిహెచ్ భాస్కర్ చారి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్నాయని అన్నారు. రేషన్ కార్డుల మంజూరు, పేదలకు గృహాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. అనాజ్పూర్ నుంచి ఘట్కేసర్ వరకు రహదారి అభివృద్ధికి భారీ నిధులు మంజూరయ్యాయని, అనేక అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆధారరహిత విమర్శలతో అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువజన ప్రతినిధులు పాల్గొని నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు మాదక ద్రవ్యాల రహిత భారతదేశం పై అవగాహన సదస్సు....

సీడ్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం మరియు విద్యార్థి దశలో వస్తున్న మార్పులు అనే విషయం పై సంస్థ నిర్వాహకులు సూర్యప్రకాష్ రావు మరియు వారి సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకొనే వయస్సులో అనేకమంది మాదక ద్రవ్యాలకు బానిస అయ్యి వారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సత్యానంద సాగర్




మాట్లాడుతూ విద్యార్థులు అంతా ఎటువంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా సమాజం లో ప్రతి ఒక్కరిని వాటి పట్ల ఆకర్షితులు కాకుండా ఉండేటట్లు




అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఇంటర్మీడియట్ కో ఆర్డినేటర్ సింహాద్రి నాయుడు, ఇంగ్లీష్ లెక్చరర్ సుధాకర్,విద్యార్థిని విద్యార్థులు పాల్గున్నారు.

# ట్రంప్ పేరుతో రోడ్డుకు నామకరణం వద్దు.. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

## : సీఐటీయూ హెచ్చరిక

## హైదరాబాద్లో ట్రంప్ పేరు వివాదం..

## ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలంటూ సీఐటీయూ నిరసన




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 23:- వనస్థలిపురంలోని ఎన్జీవోస్ కాలనీ లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఎల్బీనగర్ కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును హైదరాబాద్లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లే రహదారికి పెట్టాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు పి. రామస్వామి అధ్యక్షత వహించగా, జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విదేశీ రాజకీయ నాయకుడి పేరును నగరంలోని ప్రముఖ రహదారికి కేటాయించాలనే ఆలోచన ప్రజల భావోద్వేగాలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం పెరుగుతున్న నేపథ్యంలో వివాదాస్పద విధానాలతో విమర్శలు ఎదుర్కొంటున్న నాయకుల పేర్లను ప్రజా ప్రదేశాలకు పెట్టడం సముచితం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ రాజకీయాల్లో వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్న విధానాలను సమర్థించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించకూడదని అన్నారు. ప్రజల పన్నుల రూపంలో సమకూరే నిధులతో అభివృద్ధి చేసిన రహదారులకు స్థానిక చరిత్ర, సంస్కృతి లేదా దేశానికి సేవలందించిన ప్రముఖుల పేర్లను పరిగణనలోకి తీసుకోవడం సమంజసమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉన్న నేపథ్యంలో విదేశీ నేతల పేర్లను పెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో కార్మిక, ప్రజాసంఘాలను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టి. కృష్ణమూర్తి, రాథోడ్ అంజి నాయక్, మల్లేష్, నరసింహ, ఐతరాజు, అంజయ్య, పురుషోత్తం, చుక్క రాములు, భూష్ రాజు, కాశయ్య తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


# విద్యాదానం - మహాదానం

## --- నోట్బుక్స్ పంపిణీ కార్యక్రమం

## --- తోలుపునూరి రమేష్ గౌడ్

## మహంకాళి సికింద్రాబాద్ జిల్లా నాయకుడు

హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) హైదరాబాద్ కావాడిగూడ స్కూల్ శ్రీ సగర సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం ఉచిత నోట్బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. చిన్నవిల్లలు స్కూల్కు వెళ్ళిన సమయంలో, వారి పేరెంట్స్ మరియు కుటుంబ సభ్యులకు నోట్బుక్స్




అందజేయడం జరిగింది. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరిగేలా ఈ చిన్న ప్రయత్నం.ఈ పుణ్య కార్యక్రమంలో నేను కూడా పాల్గొని.కొంతమంది విద్యార్థులకు స్వయంగా నోట్బుక్స్ పంపిణీ చేసే అవకాశం కలిగింది. పిల్లల కళ్ళలో కనిపించిన ఆనందం మరువలేనిది. చదువు లేనిదే భవిష్యత్తు లేదు
ప్రతి బిడ్డ చదవాలి - ప్రతి కల నెరవేరాలి. ఈ గొప్ప సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ సగర సంఘమ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# టీఎన్జీవో ఐపిఎం శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక



హైదరాబాద్, జూన్ 23: టీఎన్జీవో ఐపిఎం శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణగూడ లోని టీఎన్జీవోస్ ఐపిఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి ఎం.నాగిరెడ్డి ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎస్. ప్రశాంత్ కుమార్, కార్యదర్శిగా పి.ప్రదీప్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎల్.భారతి, కోశాధికారిగా పి.శ్రీరామ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా బి. రమేష్బాబు, కార్యవర్గ సభ్యులుగా జాహంగీర్ ఆలీ, ఎన్.సత్యనారాయణ రెడ్డి, కె.పద్మలు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ గౌడ్, నగర అధ్యక్షుడు శ్రీకాంత్, యూనియన్ నేతలు లక్ష్మణ్, ఖాదర్ తదితరులు సన్మానించి అభినందనలు తెలియజేశారు.

RNI No Tel /2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
24 బుధవారం జూన్ 2026

# రోస్టర్ పాయింట్లు సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఆపండి

### తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ను కలిసి విజ్ఞప్తి చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు



హైదరాబాద్, జూన్ 23: ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్లతో నష్టపోతున్న మాల, 26 ఎస్సీ కులాలకు న్యాయం జరగాలంటే రోస్టర్ పాయింట్స్ మార్చాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ను మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు కలిసి రోస్టర్ పాయింట్లతో మాలలకు, మాల ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోస్టర్ పాయింట్లు సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఆపాలని ఆయన మీనాక్షి నటరాజన్ను కోరారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లలో మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదన్నారు. మాలలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 5శాతం రిజర్వేషన్ కేటాయించినప్పటికీ ఒక్క శాతం కూడా అమలు కావడం లేదని అన్నారు. రోస్టర్ పాయింట్లు మార్పు చేసి, ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.

## దేవర శివ దిన కార్యానికి బియ్యం వితరణ...



కసింకోట మండలం పరవాడ పాలెం గ్రామ వాస్తవ్యులు ఇటీవల స్వర్గస్తులైన దేవర శివ పెద్ద కార్యం సందర్భంగా ఉగ్గిని గంగు నాయుడు సేవా సంఘం ఆధ్వర్యంలో వారి కుటుంబానికి 75 కేజీలు బియ్యం, నెల రోజులు సరిపడా కిరాణా సరుకులు ముగ్గిన గంగు నాయుడు సేవా సంఘం సభ్యులు అందజేశారు.కార్యక్రమం లో ఉగ్గిని గంగు నాయుడు సేవా సంఘం ప్రతిదనిధులు ఉగ్గిని రమణ మూర్తి , ఉగ్గిని నాయుడు బాబు , మరియు గ్రామ పెద్దలు బలిజి ముసిలి నాయుడు, గొంతిని గంగాధర్, పరవాడ చిన రమణ, గొంతిని ఈశ్వరరావు, రెడ్డి గణేష్, కృప, సేనాపతి శ్రీను, కడిమి శ్రీను, ఏదిరి నాయుడు, కలగా గంగాధర్, సేనాపతి కృష్ణ, బర్నికాల సతీష్ తదితరులు పాల్గొన్నారు..

## 81 వ వార్డులో కూటమి నాయకులు ఓట్లు వెరిఫికేషన్



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ఓట్లు వెరిఫికేషన్ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆధ్వర్యంలో 81 వ డివిజన్ మల్ల సాంబశివరావు వీధి, అగ్గిమర్రిచెట్టు నీలకంఠరావు వీధి దిబ్బవీధి ఇంటింటి కి ఓట్లు లిస్టులతో ప్రభుత్వం నియమించిన బిఎల్ఓ రాజకీయ పార్టీల తరఫున జనసేన తెలుగుదేశం బిజెపి బూత్ ఏజెంట్లు కలసి బూత్ నెంబర్ 215 లిస్టు తో 2002 ఓటర్ లిస్టు 2024లో ఓట్లు వేసిన వారు కుటుంబ వివరాలతో ఓటర్ లిస్ట్ ప్రకారం వివరాలను ప్రతి కుటుంబానికి ఇవ్వడం జరిగిందని, దీని ప్రకారం కొత్తగా 18 సంవత్సరాల వయసు వచ్చిన వారు, పెళ్లయిన వారు, చనిపోయిన వారు, అద్దెల కున్నవారు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, కొత్తగా అద్దెకు వచ్చినవారు వీధుల్లో పరిశీలించడం జరిగిందని బి ఎల్ ఓ ఝూన్సీ బూత్ ఏజెంట్లు కాండ్రేగుల జగ్గారావు పెతకంశెట్టి వెంకటరావు సాలాపు నాయుడు వానపల్లి కోటేశ్వరరావు తెలియజేశారు.

### టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

### మండల టీడీపీ అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు



ప్రమాదంలో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ముత్తా శ్రీకాంత్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు అందజేశారు.మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన ముత్తా శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి గొంతిన శ్రీనివాసరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర,డిసిఎంఎస్ చైర్మన్ కొట్ని బాలాజీలు బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్యకర్తలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, అనకాపల్లి టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణలు అండగా నిలుస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా తెదేపా కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేశామన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ, నేతలు, నాయకులు అండగా ఉంటారన్నారు.గ్రామ టీడీపీ అధ్యక్షుడు, అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్ తన సొంత నిధులతో కార్యకర్తలకు సభ్యత్వంతో కూడిన భీమా చెల్లించడం అందరికీ ఆదర్శం అన్నారు.రమేష్ సొంత నిధులతో మంచి కార్యక్రమం చేయడం పట్ల రమేష్ ను శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ళ బాబు, తిర్రి చిరంజీవి, సిదిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పునర్విమర్శలో తొలి అడుగు కీలకం.. ప్రతి ఇంటికీ చేరనున్న ఎన్నికల సిబ్బంది

## అర్హులైన ఓటరు ఒక్కరూ మిగలొద్దు.. ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమంపై కలెక్టర్ దిశానిర్దేశం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతిదీ జూన్ 23:-
రంగారెడ్డి జిల్లాలో ఓటరు నమోదును మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు చేపడుతున్న ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా పరిపాలన యంత్రాంగం సమగ్ర సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొని కార్యక్రమం అమలు తీరుపై చర్చించారు. సమావేశంలో మాట్లాడిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, రాబోయే నెల రోజుల పాటు జరిగే ఇంటింటి సర్వే ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబాన్ని వ్యక్తిగతంగా సంప్రదించి, ఓటర్ల వివరాలను ధృవీకరించడం ద్వారా జాబితాను మరింత సమగ్రంగా రూపొందించాలన్నారు.
జిల్లా వ్యాప్తంగా అవసరమైన ఫారమ్‌లు, ఓటరు జాబితాలు ఇప్పటికే సంబంధిత అధికారులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా పూర్తయిందన్నారు. ఇంటి వద్ద ఓటర్లు అందుబాటులో లేకపోయినా పలుమార్లు సందర్శించి వారి వివరాలను సేకరించాలని సూచించారు. ఇప్పటికే నమోదై ఉన్న అర్హులైన ఓటర్లకు ఈ దశలో అదనపు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న ఎన్నికల రికార్డుల ఆధారంగా వివరాలను సరిపోల్చి నిర్ధారించడమే ప్రధాన లక్ష్యమన్నారు.
రాబోయే ముసాయిదా ఓటరు జాబితాలో వివరాల ధ్రువీకరణ పూర్తి చేసిన వారి పేర్లే ప్రతిబింబించే అవకాశం ఉన్నందున ప్రతి ఓటరు స్పందించి తమ సమాచారాన్ని సమర్పించాలని కోరారు. ఫారమ్‌ల పంపిణీ, సక్రమంగా నింపించడం, తిరిగి స్వీకరించడం వంటి అంశాల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివాసం మారిన వారు, అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు, కొత్తగా ప్రాంతానికి వచ్చిన వారి వివరాలను ప్రత్యేకంగా గుర్తించాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగిన వ్యక్తులు తమ పేర్లను ప్రస్తుత నివాస ప్రాంతానికి మార్చుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.ఓటరు మరణం, చిరునామా మార్పు వంటి అంశాలు నమోదయ్యే సమయంలో తగిన ఆధారాలను తప్పనిసరిగా సేకరించాలని, నిర్ధారణ లేకుండా ఎవరిపేరునూ తొలగించవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా ప్రతి చర్య ఉండాలని సూచించారు.ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమం విజయవంతం కావాలంటే ఎన్నికల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో స్థానం పొందేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ, ఎన్నికల విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్షాల ముప్పుపై అప్రమత్తం..

### సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్ ప్రత్యక్ష తనిఖీ

### ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు.. కీలక ప్రాంతాలపై అధికారుల దృష్టి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 23:-
షాద్‌నగర్: రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే దిశగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ చర్యలను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి ఐపీఎస్ మంగళవారం కొత్తూర్ పరిసర ప్రాంతాల్లోని కీలక రహదారి మార్గాలు, వంతెనల వద్ద వర్షపు నీటి ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. వర్షాలు అధికంగా కురిసే సమయంలో రాకపోకలకు ఆటంకం కలగకుండా ముందుగానే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రజలు ప్రయాణించే మార్గాల్లో ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే బృందాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రధాన లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.
పరిశీలన కార్యక్రమంలో శాద్‌నగర్, చేవెళ్ల పోలీసు విభాగాల ఉన్నతాధికారులు, స్థానిక పోలీసు అధికారులు, ట్రాఫిక్ విభాగ ప్రతినిధులు, మున్సిపల్ మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. వారు ప్రాంతీయ సమస్యలపై కమిషనర్‌కు వివరాలు అందించి, తీసుకుంటున్న చర్యలను వివరించారు.
వర్షాకాలంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టేందుకు కమిషనరేట్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యాల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి. ఆటో కార్మిక సంఘం

## సిఐటియుమండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్




యుద్ధ ముగిసిన ప్రజలకు ఉపశమనం కల్పించని ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ముత్యమాంబ ఆటో కార్మిక సంఘంసిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పరవాడ మండలం వాడ చీపురుపల్లిలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న జీవన వ్యయం, ఇంధన ధరల భారం కారణంగా ఆటో కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు గతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని, ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ముగిసింది.అయితే తగ్గిన కూడ ఆయిల్ ప్రయోజనాన్ని ప్రజలకు అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించడంలో ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. ప్రజలపై పన్నుల భారం మోపడం ద్వారా ప్రభుత్వాలు భారీ ఆదాయం పొందుతున్నాయని, కానీ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న పన్నులను తగ్గించి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులపైనే కాకుండా వ్యవసాయం, రవాణా, చిన్న వ్యాపారాలు, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడుతోందన్నారు. ఆటో కార్మికుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా ఇంధన ఖర్చులు, వాహనాల నిర్వహణ వ్యయాలు, విడిభాగాల ధరలు పెరగడంతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుంచి తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించలేక అనేక మంది ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. వంటగ్యాస్ ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు కూడా నిరంతరం పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. ప్రజల ఆదాయాలు పెరగకపోయినా జీవన వ్యయం మాత్రం రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన ధరలను తగ్గించడంతో పాటు ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బీమా, పెన్షన్, ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్ షబాన్, కే. అప్పలనాయుడు, నరసింహమూర్తి, పైల. తాతారావు, తలారి రామకృష్ణ, పోలవరపు తాతారావు, కూండ్రపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

24 బుధవారం జూన్ 2026

# మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభం

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్-26) సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ సోమవారం సీపీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాలల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సులు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ, డ్రగ్-ఫ్రీ క్యాంపస్ డిక్లరేషన్ కార్యక్రమాలు, కమ్యూనిటీ విజిలెన్స్ కమిటీల ఏర్పాటు వంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# తెలంగాణలో చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలు




వ్యవసాయ రంగానికి కీలకమైన నైరుతి రుతు పవనాల కదలికలపై వాతావరణ శాఖ బిగ్ అప్డేట్ ఇచ్చింది. తెలంగాణలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని తెలిపింది.

గత 15 రోజులుగా అనుకూల పరిస్థితులు లేక భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్ వరకు విస్తరించి ఆగిపోయిన రుతు పవనాల్లో కదలిక మొదలైనట్లు పేర్కొంది. సోమవారం (జూన్ 22) నైరుతి రుతు పవనాలు చురుగ్గా కదలి చురుగ్గా కదిలి నిజామాబాద్ వరకు విస్తరించాయని.. మంగళవారం (జూన్ 23) నాటికి తెలంగాణ అంతటా పూర్తిగా విస్తరించే అవకాశం ఉందని తెలిపింది. రుత పవనాల విస్తరణతో రాష్ట్రంలో రాబోయే ఐదారు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని తెలిపింది. వర్షాలతో ఎండల తీవ్రత తగ్గనుంది. సోమవారం (జూన్ 22) రాష్ట్రంలోని నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ నగరంలో సైతం సోమవారం (జూన్ 22) రాత్రి తేలికపాటి నుంచి మోస్తారు వర్షం అవకాశం ఉంది. వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలు, రైతులను వాతావరణ శాఖ హెచ్చరించింది. రైతు పవనాల విస్తరణతో వర్షాలు కురవనుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకునే అవకాశం ఉంది.

# లోక్ అదాలత్లో 10,922 కేసుల పరిష్కారం

## – వరంగల్ సీపీ సన్ప్రైత్ సింగ్,

## – సైబర్ క్రైమ్ బాధితులకు రూ.1.17 కోట్లు రీఫండ్,



వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సనీప్రీత్ సింగ్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని వివిధ న్యాయస్థానాల్లో జరిగిన ఈ లోక్ అదాలత్ ద్వారా రికార్డు స్థాయిలో మొత్తం 10,922 కేసులు పరస్పర రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయని ఆయన వెల్లడించారు. ఈ అదాలత్ ద్వారా ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. వివిధ సైబర్ నేరాలకు గురై మోసపోయిన బాధితులకు ఈ లోక్ అదాలత్ ద్వారా పెద్ద ఉపశమనం లభించిందని సీపీ తెలిపారు. సైబర్ క్రైమ్ కేస్తులకు సంబంధించి నిందితుల వివిధ బ్యాంక్ ఖాతాల్లో పోలీసులు హోల్డ్ చేయించిన రూ. 1,17,95,706 మొత్తాన్ని తిరిగి బాధితులకు అందజేయాల్సిందిగా గౌరవ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల అంగీకారంతో రాజీ కుదిరిన కేసుల వివరాలను సీపీ ఈ సందర్భంగా వెల్లడించారు. సాధారణ క్రిమినల్ కేసులు 1,880, డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు 2,864, ఈ-పెట్టీ కేసులు 201, డ్రంకెన్ డ్రైవ్ అండ్ మోటార్ వెహికల్ చట్టం కేసులు 5,977, సైబర్ క్రైమ్ కేసులు 197, మొత్తం పరిష్కారమైన కేసులు 10,922 లుగా ఉన్నాయి. “రాజీ మార్గమే రాజా మార్గం” అని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు సమయం, డబ్బు ఆదా అవ్వడమే కాకుండా ఎలాంటి మనస్పర్థలు లేకుండా న్యాయం జరుగుతుందని సీపీ సన్రైత్ సింగ్ వ్యాఖ్యానించారు. కక్షిదారులకు ముందస్తుగా అవగాహన కల్పించి, భారీ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి అహర్నిశలు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే లోక్ అదాలత్ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించి, సహకరించిన గౌరవ న్యాయమూర్తులు, న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, న్యాయవాదులు, కక్షిదారులకు సీపీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఉప సర్పంచ్ ల సమస్యల సాధనకై చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో రాష్ట్రంలోని ఉపసర్పంచుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు మస్కి కుమారస్వామి మరియు మండల ఉపసర్పంచుల ఆధ్వర్యంలో హలో “ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ “ పోస్టర్ ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా ఉప సర్పంచ్లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల బలోపేతానికి తాము నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపసర్పంచులకు గౌరవ వేతనం పెంపు, అధికారిక గుర్తింపు, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో తగిన అధికారాల కల్పన వంటి డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు.

గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంలో ఉపసర్పంచులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమ హక్కులు, అధికారాలు, సంక్షేమంపై ప్రభుత్వం సరైన దృష్టి సారించడం లేదని విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు తుడుం రాజు, దైనంపెల్లి సుమన్, లక్ష్మారెడ్డి, తిరుపతి రెడ్డి, నరేందర్, శ్రీనివాస్, రాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటే కాంగ్రెస్ నాయకులు తోక ముడిచారు

## – బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీమతి రావు పద్మ రెడ్డి ధ్వజం,



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్థానిక అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం అసత్య ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీమతి రావు పద్మ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్ లోని వేద బ్యాంక్వేట్ హాల్ లో బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు శ్రీ కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కాంగ్రెస్ పార్టీ వైఖరిపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ, వరంగల్ నగర అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరితే, సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు తోక ముడిచారని ఎద్దేవా చేశారు. ఆనాడైనా, ఈనాడైనా ఓరుగల్లు నగరంలో జరిగిన, జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కేవలం బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమైందని ఆమె స్పష్టం చేశారు. స్మార్ట్ సిటీ నిధుల నుంచి మొదలుకొని మౌలిక వసతుల కల్పన వరకు అన్నింటికీ కేంద్రమే నిధులు అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి.. ఈ ముగ్గురూ (===) అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారారని పద్మ రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బీజేపీ పై బురదజల్లుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అబద్ధాల రాజకీయం పక్కన పెట్టి, వరంగల్ అభివృద్ధికి ఏం చేస్తారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా పగడాల కాళీప్రసాద్ జిల్లా నాయకులు సంద్ర మధు, కూతురు రాజు, కందగట్ల సత్యనారాయణ, తోపుచర్ల మధు, కేతిపల్లి సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నషాముక్త్ భారత్ అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయ లక్ష్మి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యపానం మరియు ఇతర వ్యసనాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా సమాజాన్ని వ్యసన రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వసంతకుమారి, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి, జిల్లా సమాచార అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఐవీ&ఐూ జిల్లా బీసీ అధికారి ఇందిరా, జిల్లా ాజ సంక్షేమ అధికారి సుకీర్తి తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మెగా లోక్ అదాలత్: 6,545 కేసులు పరిష్కారం

## – రూ. 73 లక్షలకు పైగా రికవరీ,



మెగా లోక్ అదాలత్: 6,545 కేసులు పరిష్కారం, రూ. 73 లక్షలకు పైగా రికవరీ పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ అదాలత్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న, కోర్టు విచారణలో ఉన్న మొత్తం 6,545 కాంపౌండబుల్ కేసులు పరిష్కరించబడ్డాయి. 83 సైబర్ నేరాల కేసులను పరిష్కరించి, బాధితులకు చేరాల్సిన రూ. 73,67,714 రికవరీ చేసి తిరిగి అందజేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదిక అని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# నాపై కావాలనే ఆరోపణలు

## – మైలారం సర్పంచ్ నూనె దివ్య – తిరుపతి,



కావాలనే నాపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండలంలోని మైలారం గ్రామ సర్పంచ్ భర్త భూతం తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైలారం గ్రామ ఉపసర్పంచ్ మసికే కుమారస్వామి గ్రామ అభివృద్ధికి అడ్డు పడుతున్నారని తెలిపారు. కొన్ని పత్రికల ద్వారా ఆయన చేసిన ఆరోపణలు అవాస్తవమని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అయన తెలిపారు. గ్రామపంచాయతీకి రైతుల సమస్యలకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. రైతులకు సమస్యలు ఉంటే నేరుగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సంబంధం లేని విషయాలతో రైతులకు ముడి పెట్టవద్దని కోరారు. చౌకబారు మాటలతో మమ్మల్ని బయటకు లాగడం అంత మంచిది కాదన్నారు. గతంలో జరిగిన విషయాలకు మాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మేము తప్పు చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. ఇప్పటికైనా ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు.

# అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ.



అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రంలో కేయూసి క్రాస్ రోడ్ దగ్గర అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినాము.

ఈ కార్యక్రమానికి ముఖ్యదాత వల్లాల రాజేందర్ కృష్ణవేణి దంపతులు అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయం అర్చకుడు శ్రీ నాగరాజ్ శర్మ గారు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ జనరల్ సెక్రెటరీ దూశెట్టి భాస్కర్, స్టేట్ జోనల్ సెక్రెటరీ కంకటి సాగర్ గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు భయాన సంతోష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా సెక్రెటరీ గంగారపు బాలరాజు, జిల్లా కోశాధికారి ఇనుగాల సుదర్శన్, వాలంటీర్ కమాండర్ ఆగపాటి అజయ్, జిల్లా కమిటీ సభ్యులు, కొండ శ్రీనివాస్, బాదావత్ బాలాజీ, చెల్పూర్ భాస్కర్, జక్కు మధు కృష్ణ గౌడ్, డి నరసయ్య, దిండిగాల కాంతారావు, వేణుగోపాల్ స్వామి, శ్రీధర్ రావు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ముఖ్యమంత్రి విజయ్ బర్త్‌డే


## : పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన త్రిష పోస్ట్



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు నటి త్రిష పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన సోషల్ మీడియా పోస్ట్, గత కొన్ని గంటలుగా వారి స్నేహంపై సాగుతున్న ప్రచారానికి తెరదించింది. విజయ్‌తో కలిసి దిగిన ఒక ఫోటోను పంచుకుంటూ, తమ అనుబంధం ఎంతటిప్రత్యేకమైనదో తెలియజేసేలా ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.జూన్ 22న విజయ్ 52వ పుట్టినరోజు సందర్భంగా త్రిష నుంచి ఎలాంటి శుభాకాంక్షలు రాకపోవడంతో, ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారనే వార్తలు చర్చకు దారితీశాయి. వారి స్నేహబంధం దెబ్బతిన్నదంటూ సాగిన ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, విజయ్‌తో ఉన్న ఒక చిత్రాన్ని త్రిష సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తమ బంధం ఎంతో విశిష్టమైనదనే అర్థం వచ్చేలా ఆమె ఒక భావోద్వేగపూరితమైన క్యాప్షన్‌ను దీనికి జతచేశారు.
విజయ్ పుట్టినరోజు సందర్భంగా కట్ చేసిన కేక్ ఫోటోను షేర్ చేస్తూ, "అన్నింటికీ విలువనిచ్చే వ్యక్తికి.. ఎదీణ 00.00" అని క్యాప్షన్ ఇచ్చారు. తన క్యాప్షన్‌లో '00.00' అని పేర్కొనడం ద్వారా, జూన్ 22న అర్ధరాత్రి 12 గంటలకే తాను విజయ్‌కు విషెస్ చెప్పినట్లు త్రిష పరోక్షంగా తెలిపారు. సీఎం విజయ్‌కు త్రిష పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదని, సోషల్ మీడియాలో ఆయన్ను అన్‌ఫాలో చేశారని వచ్చిన కథనాలకు ఈ పోస్ట్‌తో ఆమె సమాధానమిచ్చినట్లు అయింది.విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత వచ్చిన మొదటి పుట్టినరోజు కావడంతో పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా విజయ్, త్రిష పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించారు. వారి మధ్య ఉన్న అనుబంధం కారణంగా, వీరి గురించి సోషల్ మీడియాలో ఎప్పుడూ ఆసక్తి నెలకొని ఉంటుంది. గతంలో విజయ్ పుట్టినరోజులకు ప్రత్యేక ఫోటోలతో శుభాకాంక్షలు తెలిపే త్రిష, ఈసారి కాస్త ఆలస్యంగా స్పందించడంతో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే, తాజాగా ఆమె చేసిన పోస్ట్‌తో ఈ ఊహాగానాలకు తెరపడింది.

# మహిళా క్రికెటర్ల కోసం ఐసీసీ ప్రసవానంతర మార్గదర్శకాలు...

## స్పందించిన దీపికా పదుకొణె




మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) రూపొందించిన నూతన మార్గదర్శకాలను బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ప్రశంసించారు. ప్రసవానంతరం క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వెసులుబాటు కల్పించేలా రూపొందించిన ఈ నిబంధనలను, మహిళా క్రీడా రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా ఆమె అభివర్ణించారు. ప్రస్తుతం రెండోసారి గర్భవతిగా ఉన్న దీపిక, ఈ మార్గదర్శకాలకు సంబంధించిన వార్తను మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంటూ ఐసీసీ నిర్ణయానికి మద్దతు తెలిపారు. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్‌నకు విరామం ప్రకటించిన రోజున ఐసీసీ ఈ 'రిటర్న్ టు ప్లే పోస్ట్ ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను సోమవారం విడుదల చేసింది. గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసవం తర్వాత మహిళా క్రికెటర్లు తిరిగి అత్యున్నత స్థాయి క్రికెట్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన సమగ్ర సహకారాన్ని ఈ మార్గదర్శకాలు అందిస్తాయి. ఇందులో భాగంగా ప్రసవానంతరం కోలుకునే ప్రక్రియ, వైద్య పరీక్షలు, శిక్షణతో పాటు మానసిక మద్దతు వంటి అంశాలను దశలవారీగా పర్యవేక్షించనున్నారు.ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ జై షా మాట్లాడుతూ, "తల్లితనం కోసం క్రీడాకారిణులు తమ కెరీర్‌ను త్యాగం చేయాల్సిన పరిస్థితి రాకూడదు. దేశం తరఫున ఆడటం లేదా అమ్మతనం.. ఈ రెండింటిలో ఒకదాన్నే ఎంచుకోవాలన్న అగత్యం ఉండకూడదు" అని పేర్కొన్నారు. ఈ నూతన మార్గదర్శకాల్లో భాగంగా ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్, శిక్షణలో వెసులుబాటు, మానసిక ఆరోగ్య నిపుణుల తోడ్పాటు మరియు అవసరమైన చోట్ల శిశు సంరక్షణ సౌకర్యాలను కల్పించాలని ఐసీసీ సిఫార్సు చేసింది. త్వరలోనే రెండో బిడ్డకు జన్మనివ్వనున్న దీపిక, ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించారు.

# బిడ్డ ఎదుగుతుంటే ఆనందమే.. ఇక నేను వెనకుండడమే సబబు: చిరంజీవి

"ఒక తండ్రిగా గర్వపడుతున్నాను. రంగస్థలం తర్వాత మళ్లీ అలాంటి సినిమా రావడానికి ఎన్నేళ్లు పడుతుందో అనుకున్నాను. కానీ ఇంత త్వరగా 'పెద్ది' రూపంలో వచ్చింది. ఈ సినిమాలో చరణ్ కనిపించలేదు, 'పెద్ది' మాత్రమే కనిపించాడు. ఇది జాతీయ అవార్డు స్థాయి నటన" అంటూ మెగాస్టార్ చిరంజీవి తన తనయుడు రామ్ చరణ్ నటనపై ప్రశంసల వర్షం కురిపించారు. 'పెద్ది' చిత్ర విజయోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, సినిమా చూస్తున్నంత సేపు ఒక తండ్రిగా, సీనియర్ నటుడిగా తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు తెలిపారు. తన ప్రసంగంలో చరణ్ పడిన కష్టాన్ని, షూటింగ్ సమయంలో జరిగిన ప్రమాదాన్ని గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు.ఈ సినిమా కేవలం ఒక చిత్రంలా కాకుండా, గిరిజనుల జీవన విధానాన్ని, వారి ఆవేదనను, పోరాటాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిందని చిరంజీవి అన్నారు. "సినిమా చూస్తున్నప్పుడు ఒక ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాను. ఎన్నోచోట్ల పెద్ది పాత్రతో పాటు ప్రయాణించి, ఆ బాధను అనుభవించాను. ఇంత పవర్‌ఫుల్, ఎమోషనల్ సబ్జెక్ట్‌ను ఎంచుకుని, దానికి చరణ్ న్యాయం చేస్తాడని నమ్మిన దర్శకుడు బుచ్చిబాబును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇది ఒక మట్టి కథ, మట్టి మనుషుల కథ. బుచ్చిబాబు లాంటి మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, ఇండస్ట్రీకి బహుమతిగా ఇచ్చిన గురువు సుకుమార్‌కు నా అభినందనలు" అని చిరు పేర్కొన్నారు. బడ్జెట్




గురించి వెనకాడకుండా, దర్శకుడి విజన్‌ను నమ్మి ఇంత భారీ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత సతీష్ కిలారు ధైర్యాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా, చరణ్ పడిన కష్టాన్ని వివరిస్తూ చిరంజీవి భావోద్వేగానికి లోనయ్యారు. "ఒక స్టార్ కొడుకుగా పుట్టినా, చరణ్ కష్టాన్నే నమ్ముకున్నాడు. ఈ సినిమా కోసం ఉదయం, సాయంత్రం కఠినమైన వ్యాయామాలు చేసేవాడు. ఒకరోజు షూటింగ్‌లో చరణ్ కంటికి దెబ్బ తగిలిందని ఫోన్ వచ్చింది. పంపిన ఫోటో చూసి కన్ను పోయిందేమోనని భయపడ్డాం. వైద్యులు కనుగుడ్డుకు ప్రమాదం తప్పిందని చెప్పాక ఊపిరి పీల్చుకున్నాం. ఆ సమయంలో నాకు మా నాన్నగారు గుర్తొచ్చారు" అని అన్నారు.

"1983లో 'గూండా' సినిమా షూటింగ్‌లో, రన్నింగ్ ట్రైన్ కింద నేను వేలాడుతూ ఒక ఫీట్ చేశాను. అది చూసి నాన్న కంగారుపడి, 'ఇంత కష్టపడాలా? రేపు నీకు కొడుకు పుట్టి, వాడు ఇలాంటి కష్టాలు పడితే నా బాధేంటో నీకు తెలుస్తుందిరా' అన్నారు. ఇన్నాళ్లకు, చరణ్‌కు దెబ్బ తగిలినప్పుడు నాన్న ఆవేదన ఏంటో నాకు తెలిసొచ్చింది. ఆయన నోటి వాక్యమే నిజమైంది. కష్టపడకుండా ఏదీ రాదు, దానికి అడ్డదారులు లేవు. చరణ్ ఆ కష్టానికి ప్రతిఫలంగానే ఈ రోజు మీ అందరి మన్ననలు పొందుతున్నాడు" అని చిరంజీవి ఉద్వేగంగా చెప్పారు.ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన జగపతిబాబు ఆహార్యం, నటన అద్భుతమని, శివరాజ్‌కుమార్ తన హుందాతనంతో పాత్రకు నిండుతనం తెచ్చారని అన్నారు. ఇక సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తన సంగీతంతో సినిమాకు ప్రాణప్రతిష్ఠ చేశారని, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు మునుపెన్నడూ చూడని విజువల్ వండర్ సృష్టించారని సాంకేతిక నిపుణులను కూడా అభినందించారు. "ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో చరణ్‌ను 'న్యూ ఏజ్ మెగాస్టార్' అని సంబోధించారు. బిడ్డలు మనకంటే ముందుకెళుతుంటే ఆ ఆనందమే వేరు. ఇప్పుడు చరణ్‌ను ముందుంచి, నేను వెనుక ఉండటమే సబబు. ఈ సినిమాతో పూర్తిస్థాయిలో పుత్రోత్సాహం పొందుతున్నాను. పనిలోనే ఆనందం, శక్తి ఉంటాయి. అందుకే చివరి శ్వాస వరకు నటిస్తూనే ఉంటాను" అని చెప్పారు.

# పర్పుల్ డ్రెస్‌లో సెల్ఫీలతో హీటెక్కిస్తున్న జాన్వీ.. కొత్త అబ్సెషన్ అదేనట!

గ్లామర్ బ్యూటీ జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో పెట్టే ప్రతి పోస్ట్ క్షణాల్లో వైరల్ అవుతుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని క్యాండిడ్, మిర్రర్ సెల్ఫీలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. గ్లోబల్ ఫ్యాషన్ బ్రాండ్ 'జారా' కి చెందిన పర్పుల్ రఫుల్ డ్రెస్‌లో మెరిసిపోతూ.. "నేను, నా సెల్ఫీలు.. నా కొత్త అబ్సెషన్" అంటూ పెట్టిన ఈ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఆ క్యూట్ అండ్ హాట్ లుక్స్ విశేషాలు ఇప్పుడు చూద్దాం.. లేటెస్ట్ ఫోటోషూట్‌లో జాన్వీ కపూర్ డీప్ లైలాక్ పర్పుల్ కలర్ రఫుల్-ట్రిమ్డ్ డ్రెస్‌లో దేవకన్యలా కనిపిస్తోంది. అసిమెట్రికల్ మిడి డిజైన్, వి-నెక్ లైన్, షీర్ ఫ్యాబ్రిక్‌తో ఉన్న ఈ స్లీవ్‌లెస్ డ్రెస్ ఆమె గ్లామర్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లింది.ఇక అద్దం ముందు నిలబడి చేతిలో వైట్ స్మార్ట్‌ఫోన్ పట్టుకుని, మెరిసే నవ్వుతో ఆమె ఇచ్చిన క్యాండిడ్ పోజులు ఫ్యాన్స్‌కు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఇక ఈ లుక్‌కు మ్యాచింగ్‌గా చేతికి బ్రాస్‌లెట్స్, పక్కన ఒక పెద్ద టాన్ టోట్ బ్యాగ్‌ను యాక్సెసరీస్‌గా స్టైల్ చేసింది. టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ హిట్స్: ఇటీవలే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన నటించిన 'పెద్ది' సినిమాతో జాన్వీ కపూర్ తెలుగులో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుంది. ఇక బుచ్చిబాబు సానా డైరెక్ట్ చేసిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి భారీ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాలో జాన్వీ నటనకు, గ్లామర్‌కు తెలుగు ఆడియన్స్ ఫిదా అయిపోయారు. భవిష్యత్తులో ఎన్టీఆర్ సరసన 'దేవర: పార్ట్ 2' లో కూడా ఈమె సందడి చేయబోతోంది. కేవలం సౌత్ మాత్రమే కాదు, అటు నార్త్‌లోనూ జాన్వీ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. ప్రస్తుతం టైగర్ ష్రాఫ్ సరసన 'లగ్ జా గలే' సినిమాలో నటిస్తోంది. ఇక వీటితో పాటు 'పరమ్ సుందరి', 'హోమ్‌బౌండ్', మరియు వరుణ్ ధావన్‌తో కలిసి 'సన్నీ సంస్కారీ కీ తులసి కుమారి' వంటి హై-ప్రొఫైల్ చిత్రాల్లో నటిస్తూ 2026-2027 లో బిగ్గెస్ట్ లైనప్‌ను సెట్ చేసుకుంది. గ్లామర్ పరంగానే కాకుండా నటిగా కూడా జాన్వీ కపూర్ రోజురోజుకూ తన వర్సటాలిటీని నిరూపించుకుంటూ ఇండియన్ సినిమా పరిశ్రమలో తనకంటూ ఒక స్ట్రాంగ్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకుంటోంది. ఇక ప్రస్తుతం ఆమె షేర్ చేసిన ఈ పర్పుల్ డ్రెస్ సెల్ఫీలు ట్రెండింగ్‌లో ఉన్నాయి. మరి ఈ బ్యూటీ మరిన్ని తెలుగు సినిమాలకు సైన్ చేసి టాలీవుడ్ ప్రేక్షకులను ఎప్పుడు అలరిస్తుందో చూడాలి.



# థియేటర్లలో పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ రేట్లు తగ్గాలి: రామ్ చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్-ఇండియా స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ దగ్గర జోరు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ రిలీజ్ తర్వాత రామ్ చరణ్ మొదటిసారి ఒక నేషనల్ స్టేజ్‌పై కనిపించి సందడి చేశారు. న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'సమ్మిట్ 2026'లో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.'గ్రేట్ పవర్ ఇండియా: నేషన్ ఫస్ట్' అనే థీమ్‌తో జరిగిన ఈ సమ్మిట్‌లో అర్ణబ్ గోస్వామితో సాగిన స్పెషల్ సెషన్‌లో... చరణ్ కేవలం సినిమా గురించే కాకుండా సాధారణ ఆడియన్స్ ఎదుర్కొంటున్న ఒక ప్రధాన సమస్యపై మాట్లాడారు. థియేటర్లలో ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఎదురవుతున్న ఇబ్బందులపై రామ్ చరణ్ స్పందించారు. "భారతదేశంలో ఇప్పటికీ మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్‌కు అత్యంత చౌకైన వినోదం సినిమా మాత్రమే. కానీ ప్రస్తుతం ప్రేక్షకులు థియేటర్లలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఫుడ్ అండ్ బేవరేజెస్ ధరలే. మల్టీప్లెక్స్‌లలో పాప్‌కార్న్, కూల్‌డ్రింక్స్ రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రేక్షకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ అధిక ధరల భారం వల్ల చాలా మంది థియేటర్లకు రావడానికే వెనుకంజ వేస్తున్నారు. ఈ రేట్లు కొంత



తగ్గితే ఆడియన్స్‌కు సినిమా ఎక్స్‌పీరియన్స్ మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది" అని చరణ్ పేర్కొన్నారు.







